# అతిథి రాక్షసులు

**సౌ**మవారం పొద్దున పదకొండు, ఫోన్ మోగింది. శిరీష మా అమ్మాయి. కలకత్తా నించి.

''ఏమ్మా ఎలా వున్నావ్? నిన్నటి ప్రొగ్రాం బాగా జరిగిందా?'' అడిగింది.

''ఆ! బాగానే జరిగిందిలే'' అని చెప్పాను.

''ఏవిటంత నీరసంగా చెప్తున్నావ్? మీ ముగ్గురూ కలిస్తే ఇల్లుపీకి పందిరి వేసి కబుర్లు చెప్పుకుని హుషారు హుషారుగా వుంటారుగా!'' అనుమానంగా అడిగింది.

''ఎండలు మండిపోతున్నాయి కదా!'' సర్దెయ్యాలని చూశాను.

''అవును. ఇక్కడా వేడిగానే వుందిలే. ఎన్నింటి కొచ్చారు?''

''ఒంటిగంట దాటింది!''

''రాగానే సూప్ ఇచ్చావా?'' అన్నీ వివరంగా చెప్తే గానీ వదలదు నా కుమార్తె.

''ఇంతెండలో సూపేం ఇస్తాను? కూల్‌డ్రింక్ ఇద్దామనుకున్నా. వాళ్ళు పడనిస్తేనా? మాకు నీరసం, శోష వచ్చేస్తోంది వడ్డించెయ్యండి వడ్డించెయ్యండి అని వాకిట్లోనించే గోల. సరే అన్నీ రెడీగానే వున్నాయ్. వడ్డిస్తా... మొహాలు మాడిపోయాయి ఎండకి. వెళ్ళి ఎవరి మొహం వాళ్ళు కడుక్కురండి అని తువ్వాలు ఇచ్చి పంపించి నేను రంగంలోకి దిగాను'' చెప్పాను.

''ఇంతకీ వంటేం చేశావు?'' కుతూహలంగా అడిగింది మా అమ్మడు.

''గుత్తొంకాయ కూర, అరటికాయ పులుసూ, బెల్లంపెట్టి కూర, చింత చిగురు పప్పు, కొబ్బరి పెరుగు పచ్చడి, దోసకాయ ముక్కల పచ్చడి, సాంబారు, గారెలు, ఆవడలు, కొత్తావకాయ, పెసరావకాయ ఎలాగూ వున్నాయి కదా. కాసిని అప్పడాలు ఊరమిరప కాయలూ వేయించా'' రస్‌మలాయ్, ఐస్‌క్రీం, పళ్ళు, కిళ్ళీలు'' చెప్పాను.

బోలెడంత సంతోషించింది మా శిరీష. ''అదీ! మా అమ్మంటే అన్నపూర్ణ. ఇన్ని రకాలు చేశావ్! వాళ్ళు బాగా మురిసిపోయుంటారేం! నిన్ను బాగా పొగిడారా?'' సరదాగా అడిగింది.

అప్పటిదాకా ఆపుకొన్న ఉక్రోషం బయటపడిపోయింది. ''పొగడటమా! నా బొందా? ఇద్దరూ కలిసి కాల్చుకు తిన్నారు. చేసిన పదార్థాలు ఎందుకు చేశావు? అని నిలదీసి అడిగారు. చెయ్యని ఐటమ్స్‌ని ఎందుకు చెయ్యలేదు? అని సాధించారు'' చెప్పుకున్నాను.

''వాళ్ళిద్దరూ ఏదైనా పనిచేస్తున్నారా?'' అడిగింది.

''ఒకటా? బోలెడన్ని వ్యాపకాలు, వ్యవహారాలు, గతంలో మనుషుల ప్రాణాలు తియ్యాలంటే గన్ను ఉపయోగించేవాళ్ళు. ఇప్పుడా అవసరంలేదు. పెన్నూ మైకూ వంటి మారణాయుధాలతోనూ చంపుకు తినొచ్చు. వాళ్ళిద్దరిదీ అదే పని. ఆయనేమో రాసేస్తూ వుంటారు. ఆవిడమో ఊరూరూ తిరిగి ఉపన్యాసాలిస్తూ వుంటుంది'' నాకు తోచిన రీతిలో చెప్పాను. అక్కసు ఆపుకున్నా దాగడంలేదు.

''వాళ్ళిద్దర్నీ వెంటనే ఆపన్లన్నీ మానేసి ఆడిటర్లుగా పనిచెయ్యమను. ఆ వృత్తిలో అయితే బాగా రాణిస్తారు!'' అంది మా అమ్మాయి. దానికి చిన్నప్పట్నించీ బోలెడన్ని తెలివితేటలు.

**పొత్తూరి విజయలక్ష్మి**

''భోజనం చేసి వెంటనే వెళ్ళారా?'' మళ్ళీ తనే అడిగింది.

''అబ్బే వెంటనే వెళ్తేవాళ్ళ గొప్పతనం ఏముంటుందీ? నాలుగింటిదాకా నా బుర్రతిని కాస్త కాఫీ తాగి అబ్బ కమ్మగా వుంది కాఫీ. మీ అపరాధాలన్నీ ఈ కాఫీతో చెల్లు అని వెళ్ళిపోయారు'' చెప్పాను.

''పోన్లే వెంటనే వెళ్ళారేమో బతికిపోయావ్. ఇంకాసేపుంటే కాఫీకి కూడా వంకపెట్టి కాల్చుకు తినే వాళ్ళే!''

''నిజమేలే అప్పటికదే అదృష్టం'' నాకూ అదే అనిపించింది.

జాలిగా నవ్వింది శిరి తల్లి. ''పిచ్చి మొహమా! పూజ కొద్దీ పురుషుడూ, దానం కొద్దీ బిడ్డలూ అని సామెత చెప్పినట్లూ నిన్ను వేధించుకు తినడానికి నాన్నగారూ, మేమిద్దరం చాలమా!

స్నేహితులకి కూడానా! వెతికి వెతికి ఇలాంటివాళ్ళని ఎంచుకుంటావు ఎప్పుడూనూ! సర్లేకానీ! ఆమధ్య ఏదో పుస్తకంలో చదివాను స్నేహంకూడా జన్మజన్మల అనుబంధమేనట. ఇంతకీ వాళ్ళిద్దర్నీ మళ్ళీ ఎప్పుడు పిలుస్తావు భోజనాలకి?'' అడిగింది.

''పిలుస్తాలే! నాకు మూడినప్పుడు'' చెప్పాను.

''సర్లే కాసేపు రెస్టు తీసుకో!'' అనేసి ఫోన్ పెట్టేసింది.

నిజంగానే నిస్త్రాణగా వుంది నాకు. కాసేపు నడుం వాల్చాను. ఫోను మోగడం మొదలుపెట్టింది.

## ఇది అందరి రహదారి...!!

నిత్యం అందరి పయనం
ఈ రహదారి మీదుగానే...!
ధనికులైనా, నిరుపేదలైనా...
మంత్రులైనా, సామంతులైనా...!
రసికులైనా, విటులైనా, నటులైనా
ఉపాధ్యాయులైనా, విద్యార్థులైనా...!
అందరికీ ఇదే రహదారి...
అయిదునక్షత్రాల భవనాలు
అపురూప కళాకృతులకు ఆనవాళ్ళు...!!
నిరుపేదల నివాసాలు... అవి
అలుపెరుగని అనాధ శరణాలయాలు...!
వృద్ధులైనా, అంధులైనా, బధిరులైనా...
వారి దృష్టికి, త్రుష్టకు ఇదే గమ్యం...!
పూటగడవని నిరుపేదల బ్రతుకులు...
తుదిశ్వాస విడిచేది ఈ రహదారి పైనే...!!
అధునాతన వాహనదారులైనా...
అధములు అధిరోహించే...
బ్రతుకు శకటాలైనా... అందరికీ...
ఈ రహదారే కదా శరణ్యం...!!
ఊరేగింపులకు, అంతిమయాత్రలకు...
నిరసన ప్రదర్శనలకు, దీక్షా శిబిరాలకు...!
నాయకుల బహిరంగ సభలకు...
వీధిభాగవతులు, అనాథల ఆకలి కేకలు...
ప్రతిధ్వనించేవి ఈ రహదారిపైనే...!!
బ్రతుకు తెరువుకోసం విచిత్ర విన్యాసాలు...
అరాచక శక్తుల స్వైరవిహారాలు...
అబలల అత్యాచారాలు, ఆర్తనాదాలకు
ఈదారే ప్రధాన రహదారి...!
బడుగుజీవుల ప్రాణాలు అగ్నిలో
రగిలే జ్వాలలు...!!
ఎంతో ఘన చరిత్ర కలిగిన ఈ రహదారి...
కొందరికైనా అనుగ్రహించాలి జీవనోపాధి...!!

తంగెళ్ళ పాండురంగశర్మ

## మా వెంకన్న

"అమ్మా! ఆకలి, అయ్యా! జ్వరం
స్వామీ! నా బిడ్డపై అత్యాచారం
అన్యాయంగా నా తాళి తెంచారు
సారూ! పనియిచ్చి పుణ్ణెంకట్టుకోండి
వున్న అరకొండ్రా లాక్కున్నారు తండ్రీ!
కట్టుకున్న ఇంటినే కబ్జా చేశారు నాయ్‌నా!"
ఘోష... అసమాన జనఘోష
కార్ల వీరోచిత దండయాత్రలు
నలిగిన భిక్షా పాత్రలు
సంగీత సాహిత్య తధిగిణతోం
పబ్బుల్లో థెక్కుల్లో తందనాలు
పైసల చిందులు కరెన్సీ గెంతులు
పిబరే రామరసం జుర్రుకో అందినంత
అరుపులు ఆనందదాహాలు
అదీ... ఇదీ పట్టించుకోని అతీతుడు
నిత్యనవ చిద్విలాసుడు
ఆయన కనడు... వినడు
కొననగవులు విసురుతుంటాడు
పాహీ! కరావలంబందేహీ! అంటే
కుడి అరచేతితో చూడు అంటూ
భువన మోహనంగా
మట్టిని చూపుతాడు
మట్టిగుట్టు కనుక్కోలేని
ఆయన కొననవ్వుల రహస్యం తెలియని
జీవన పద్మవ్యూహంలో
అధోజగతి అభిమన్యుడను
పొట్టలోని నిప్పుదెయ్యాలకు
గుండెలోని పాశాల గునపాలకు
కళ్ళలో నిండిన ఇసుక స్వప్నాలకు
అర్థం అడిగితే...
ఆయననెవరు కన్నుల నుండి
అర్భకుడా! అన్న అక్షరాలు జారుతున్నాయేమో
అనుకుంటూ బ్రతికేస్తున్న
నా అమాయకత్వం

ఎస్.మునిసుందరం

నెంబరు చూశాను. ఏడుపొచ్చింది. ఎత్తలేదు. మోగి మోగి ఆగిపోయింది. మరుక్షణం పక్కనున్న సెల్ మోగడం మొదలుపెట్టింది.

సోమరాజు సుశీల పేరు కనిపిస్తోంది. ఎంతకని తప్పించుకోగలను? తీసుకున్నా. ''ఇంట్లో లేరా?'' అడిగిందావిడ.

''ఇంట్లోనే వున్నా''

''మరి ల్యాండ్ లైన్‌కి చేస్తే తియ్యలేదేం?'' నిలదీసింది.

''తీసేలోగా ఆగిపోయింది'' చెప్పాను.

''సర్లేండి. ఇందాక శ్రీరమణ గారు ఫోన్ చేశారు. మేమిద్దరం మళ్ళీ కూలంకషంగా చర్చించుకున్నాం'' అంది. నాకు చిర్రెత్తుకొచ్చింది.

''మీ చర్మ మండిపోనూ! ఇద్దరూ ఏకమై నన్నెందుకిలా ఏడిపించుకు తింటున్నారు? మీ బారినపడి వారం రోజుల్నించీ కంటికి కునుకులేదు'' అన్నాను. అంతేకాదు మిమ్మల్నిద్దర్నీ భోజనానికి పిల్చినందుకు నా చెప్పుతో నన్ను నేనే కొట్టుకోవాలి. అని కూడా అన్నాను.

ఆవిడేం పట్టించుకోలేదు. తన మానాన తను చెప్పుకుంటూ పోయింది.

అసలు విషయం ఏమిటంటే ఆదివారం వాళ్ళిద్దర్నీ సపరివార సమేతంగా మధ్యాహ్నం భోజనానికి ఆహ్వానించాం. అదేం కొత్త విషయంకాదు. 2004లో మేము ఈ ఊరు వచ్చిన దగ్గర్నుండి మా కుటుంబాల

మధ్య ఎంతో స్నేహం ఏర్పడింది. నేను సుశీలగారూ ప్రతిరోజూ రెండు మూడుసార్లు ఫోన్లు చేసుకుంటాం. శ్రీరమణగారు రోజూ మాట్లాడరుగానీ రెండు మూడు రోజులకి ఒకసారి తీరిగ్గా ఓ గంటో గంటన్నరో కబుర్లు చెప్పుకుంటాం. పిల్లలు సెలవులకి వచ్చినప్పుడే పండుగల్లోనూ పర్వదినాల్లోనూ ఎక్కడో ఒకచోట చేరి భోజనం చేస్తాం.

సుశీలగారు తనో నాలుగు రకాలు చేసి, వెంకటమ్మ చేత మరోపది రకాలు చేయించి కసాటా ఐస్‌క్రీం తెప్పించి బోలెడంత హడావిడి చేస్తారు.

ఇక శ్రీరమణ గారింటి సంగతి చెప్తే పనిలేదు. తను సెలవుపెట్టి, వాళ్ళబ్బాయి చైత్రచేత కూడా సెలవుపెట్టించి అరిటాకుల దగ్గరనుండి తమలపాకుల దాకా అత్యంత శ్రద్ధగా కళాత్మకంగా ఏర్పాటు చేస్తారు. వెళ్ళగానే మంచినీళ్ళిచ్చే స్టీలు గ్లాసు మొదలుకొని, వెండి వక్కపొడి భరిణ దాకా మిలమిల మెరిసిపోతూ వుంటాయి. బోలెడన్ని వండించి తినిపించి తెగ ఆనందపడిపోతారు.

మేమూ వాళ్ళంత కాకపోయినా మా శాయశక్తులా చేస్తాం? సాధారణంగా వాళ్ళూ మెచ్చుకుంటారు. ఈసారే వ్యవహారం బెడిసికొట్టింది.

వచ్చే ఆదివారంనాడు మా ఇంటి వెనకాల ఏదో మీటింగుందిట. వాళ్ళిద్దరూ హాజరు అవుతున్నారు. ఎలాగా ఇంతదూరం వస్తున్నారు కదా. మా ఇంటికి భోజనానికి రండి అన్నాను. అయ్యో దానికేం భాగ్యం అలాగే అని ముక్తకంఠంతో ఒప్పుకున్నారు. వాళ్ళిద్దరిదీ కప్పలతక్కెడ వ్యవహారం. ఒకరికి కుదిరితే మరొకరికి కుదరదు. ఆ మీటింగు పుణ్యమా అని ఇద్దరికీ వీల యింది. మేము పిలవడం వాళ్ళు సరే అనడం జరిగింది సోమవారం నాడు.

మంగళవారం నాడు సుశీల గారి ఫోను. ''ఎక్కువ హడావిడి చెయ్యొద్దు. రెండో కూర కూడా వద్దు. కొబ్బరి పెరుగుపచ్చడి చేసెయ్యండి'' అని చెప్పారు.

## ఎవరివో

నీ పలకరింపుతో శుభోదయమై
నన్ను మేలుకొలుపుతావు
ఆప్యాయతా అనురాగం
గొంతునిండా నింపుకొని
ఆశగా పిలుస్తావు
మాటలతో మనసు ఓదార్చి
మంచి సుగంధం చల్లుతావు
క్షేమసమాచారం
కులాసా కబుర్లతో
వంటరితనాన్ని దూరం చేసి
మనసుకు చేరువులోనుంటూ
ఆత్మీయంగా ఆదరించే నేస్తంలా
నిత్యం నీ జ్ఞాపకాల వెంట తిప్పుకొంటూ
ఊహల స్వప్నాలలో ఊరేగిస్తావు
అంతలోనే అలకబూని
కోపం విరహ తాపాలతో
ఎడబాట్లు, కలయికలు
కవ్వింపులు, మోహాలు
చీకటిదిగుళ్ళు - మనసుగుబుళ్ళు
క్షణాలు యుగాలుగా గడుపుతూ
నా గుండె నడుగు నేనెంతగా నిరీక్షించానో
పలకరింపులెరుగని ఆ అలకలు
ఈ ఓపలేని తాపాలు నావల్లగాదు
మనసు రాపిళ్ళకు రాలిపోయిన
ప్రేమపుష్పాళ్ళు
చెరిగిపోని స్వప్నంలా వచ్చావు
మబ్బుల్లో దాగిన చంద్రుడివా
మేఘంలో చాటున చినుకువా!
ఎవరివో! నీవెవరివో!

తాటికోల పద్మావతి

''సర్లెండి. ఏదో నాకు తోచినవిధంగా చేస్తాను'' అన్నాను.

బుధవారం శ్రీరమణగారి ఫోను ''కలగలుపు పప్పు విషయంలో ఏం నిర్ణయించుకున్నారు?'' అని అడిగారు.

''ఇంకా ఏం అనుకోలేదు. మామిడికాయో దోసకాయో వేస్తాను లెండి!'' చెప్పాను.

''ఛ. చింత చిగురు కాలంలో అవన్నీ ఎందుకు? సలక్షణంగా చింతచిగురు పప్పు వండుకుందాం!'' అన్నారు. వండండి అని తిన్నగా చెప్పరు. అందులోనూ బోలెడంత లౌక్యం.

''అలాగే'' అన్నా.

''దానికి తోడు వంకాయా చిక్కుడుకాయా కూర కాస్త అల్లంవేసి వండుకుంటే అదిరిపోదూ. అబ్బో! ఇక చెప్పేదేముంది'' మరో సూచన.

''సరే. అలాగే వండుకుందాం'' దానికీ సరేనన్నా.

గురువారం తెల్లారేసరికి సుశీలగారి ఫోను ''చిక్కుడుకాయ కూరనుకున్నారుట కదా! జాగర్త మరి. ఈమధ్య చిక్కుడుకాయలు చూడ్డానికి బాగున్నా లోపల పురుగులు. కాస్త ఏమరుపాటుగా వుంటే మాకు మాంసాహార భోజనమేగతి'' అంటూ భయపెట్టారు.

## వరద

దడదడమని బడబడమని
వచ్చిందీ వరద
కర్నూలును తుడిచిపెట్టి
పోయిందీ వరద
రాష్ట్రంలో పలు తావుల
శివమెత్తెను వరద
అక్షరాల కొంపలన్ని
ముంచిందీ వరద
దేవుణ్ణీ కూడా వదిలి
పెట్టలేదు వరద
మంత్రాలయమంత
ముంచిపోయిందీ వరద
ఇళ్ళైనా గుళ్ళైనా
తేడాలేదంది
మనుషులైన దేవుడైన
ఒకటేననె వరద
రోజులతరబడి కడుపులు
కాల్చిందీ వరద

కంటి కునుకు మింగేసి
పోయిందీ వరద
నీరు ప్రాణదాత, కాని
నీరు ప్రాణ ఘాతగా
మార్చి బ్రతుకులను ముంచి
పోయిందీ వరద
చుట్టూ కనుచూపుమేర
నీరే నీరే నీరే
తాగనొక్క గుక్కెడైన
లేకజేసె వరద
ప్రభువులకూ గుండెదడ
పుట్టించెను వరద
నాయకులను భీభత్సం
లో ముంచెను వరద
వరదా! ఇది యేమిటంటు
దేవుడడగ లేదు
దేవుణ్ణీ బురదలోన
ముంచింది వరద

కెయల్లెన్

''సరే వండను లెండి అన్నా. మరి మీరు వస్తారుగా మీటింగుకి?'' అడిగారు.

''మీ మీటింగుకి నేను రానా? వస్తాను. అంటే ''మరి అన్నం మాటేవిటి? వండొస్తారా? వచ్చి వండుతారా?'' అని మరో సందేహం. ''ఏదో చేస్తానులే మీకెందుకు'' అని కించిత్తు విసుక్కున్నాను.

మరికాసేపటికి శ్రీరమణ గారి ఫోను. ''పాపం పెద్దావిడ. స్నేహధర్మంతో సలహా చెప్తే మీక్కోపం వచ్చిందిట కదా! ఆవిడ పాపం బోలెడు బాధపడుతున్నారు!''

''ఆవిడకెందుకు బాధ. అన్నీ చెప్పడానికి నేనేమైనా చిన్నపిల్లనా? కొత్తగా కాపురానికి వచ్చానా?''

''సర్లెండి. భోజనానికి వెళ్లేచోట ఏర్పాట్లేమిటి? ప్రయత్నాలేమిటి అని దాని శిగతరగ అడిగి తెలుసుకో వద్దూ! ఇంతకీ అన్నం ఎప్పుడు వండుతారుట? ఆవిడ అడగమన్నారు!'' మెల్లిగా అడిగారు శ్రీరమణగారు.

నాకు అరికాలి మంట నెత్తికెక్కింది. ''ఏదో నాచావు నేను చస్తాను. బుద్ధిగడ్డి తిని పిలిచినందుకు చంపుకు తింటున్నారు. ఆరాటానికైనా అంతుండాలి. ఇక మీరి ద్దరూ వంట మాటెత్తితే ఊరుకోను'' అని గట్టిగానే చెప్పాను.

''సర్లెండి. మంచికిపోతే చెడు ఎదురవుతుంది'' అనేసి ఫోను పెట్టేశారు.

మరి ఏం మాట్లాడుకున్నారో నన్నేం అడగలేదు. సలహాలూ చెప్పలేదు. కానీ నాకు మాత్రం పీడకలలు. అన్నం చిమిడిపోయినట్లూ, కూరలో పురుగొచ్చినట్లూ.

ఆదివారంనాడు వచ్చి డైనింగ్ టేబిల్ ముందుకూర్చున్నారు. నేను వడ్డిస్తానంటే వద్దొద్దు కూర్చోండి అని బలవంతపెట్టారు. కూర్చున్నా.

ఈ సందట్లో పడి మరికొందరు వ్యక్తులను పరిచయం చెయ్యడం మర్చిపోయా. జానకి. శ్రీరమణగారి శ్రీమతి. నిజంగా జానకే. ఆయన అవకాశం ఇస్తే వీణ మీటినట్లూ రెండు మాటలు మాట్లాడుతుంది. లేకపోతే తనదారిన తను కూర్చుంటుంది.

సోమరాజు రంగారావు గారు. సుశీలగారి భర్త. పాపం ఎంత మంచివారు. పరిచయం అయి ఇంతకాలం అయినా ఆ బ్రాహ్మడిని చూసిన ప్రతీసారీ నాకు గుండె తరుక్కుపోమంది జాలితో.

మా శ్రీవారు రైల్వేలో పనిచేసిన అనుభవం కదా. రాజధాని ఎక్స్‌ప్రెస్‌లా తను హడావిడిపడిపోయి నన్ను హడావిడి పెట్టేస్తుంటారు.

అందరం కూర్చున్నాం. మా పద్మజ వడ్డన.

శ్రీరమణగారు ఓసారి పదార్థాలవంక చూశారు. ఎందుకింత హడావిడి అంటారేమో అని పిచ్చి పీనుగలాగా ఎదురుచూస్తున్నా.

అన్నం ముందుకి లాక్కుని ''మనం అనవసరంగా ఆదుర్దా పడ్డాంగానీ సుశీలగారూ అన్నం బానే వుంది'' అన్నారాయన.

అన్నం బానేవుంది. గుత్తొంకాయ కూరలో కాస్త ఉప్పు తక్కువ. కానీ బాగానే వుంది అంది ఆవిడ గారు. అన్నీ వడ్డించుకోండి. అంటే ఇద్దరికీ కోపాలొచ్చాయి?

''అలాగే. మా సంగతి మేము చూసుకుంటాం. మీరూరికే వూ వెంటపడకండి. మేమేం పరాయి వాళ్ళమా!'' అని మందలించారు. సరే మీ ఇష్టం అని వదిలేశా.

''శ్రీరమణగారూ అంటే ఈవిడకి కోపం వస్తుందిగానీ ఈ దోసకాయ పచ్చడెందుకు చెప్పండి?'' అన్నారు సుశీలగారు నాలుగో గారె తింటూ.

''పోన్లెద్దురూ! ఎవరి పిచ్చి వారికి ఆనందం!'' అన్నారు శ్రీరమణగారు దోసకాయ పచ్చడి కలుపుకుని నెయ్యి వేసుకుంటూ!

''చింతచిగురు పప్పు వుండగా మళ్ళీ ఉత్తపప్పుకూడా చేయడం ఏమిటండీ అనవసర ఆర్భాటం కాకపోతేనూ'' అడిగిందావిడ. గతంలో ఓసారి ఎన్నున్నా కాస్త పప్పుంటే ఆ నిండుతనమే వేరు అని ఆవిడే చెప్పింది. గుర్తు చేద్దామా అనుకున్నాను గానీ వ్యర్థప్రయత్నం. ఇప్పుడు చెప్పిన సంగతి అరగంట తర్వాత గుర్తుచేస్తేనే అలా అన్నానా ఏమో నాకు గుర్తులేదు అంటుంది.

''అసలా మెనూ నిర్ణయించడం ఒక కళ. అందరికీ అలవడదు'' అన్నారు శ్రీరమణగారు చిద్విలాసంగా.

''చింతచిగురు పప్పు బావుంది'' అంది పాపం జానకి సందు చేసుకుని మాటమారుస్తూ.

''బావుండదా మరి! అడిగిమరీ వండించుకున్నాం'' అని మురిసిపోయారు శ్రీరమణగారు.

''కొత్తావంకాయ రుచిచూసి చెప్పండి పాకశాస్త్ర పండితుల్దిరూనూ!'' అన్నాను.

''తిన్నాంగా!'' అన్నారు.

''అది పెసరావకాయ'' అంటే ''ఆమాట ముందు చెప్పద్దూ అసలావకాయ అనుకుని పెసరావకాయ తినే శాం. అన్యాయం జరిగిపోలేదూ! ఎవరినైనా భోజనానికి పిలిచినప్పుడు వాళ్ళేం తింటున్నారో కాస్త చూసుకో వద్దూ!'' అన్నారు ఇందాక మాజోలికి రావద్దన్న

పెద్దమనుషులిద్దరూ!

''ఇందాకట్నించీ మొత్తుకుంటున్నా వడ్డించు మొర్రోమని, నా గోల ఎవరూ పట్టించుకోలేదు'' అన్నారు మావారు.

సాధింపులతో భోజనాలు ముగిశాయి. స్వీట్‌డిష్ రసమలాయ్. ''ఒక్కటీ పెట్టకూడదు. కనీసం రెండైనా పెట్టాలి!' సుశీలగారి మందలింపు.

మారడుగుతా కదా! అంటే ''ఏం రెండు పెట్టి మార డగకూడదా!'' అని మళ్ళా మందలించింది. శ్రీరమణ గారు స్వీటా తినరు. పాన్ తిని కోప్పడ్డారు. కిళ్ళీలో స్వీట్ ఎక్కువైంది. దీని బదులు ఇన్ని తమలపాకులు తెప్పిస్తే నేనే కట్టేవాడిని కదా కిళ్ళీలు'' అన్నారు. ఆయన చాలా ఓపిగ్గా కడతారు కిళ్ళీలు.

''అవునూ మీది ఏ జిల్లా?'' హఠాత్తుగా అడిగింది సుశీలగారు, రెండో పాన్ నోట్లో వేసుకుని.

''బాగానే వుంది మీ మతిమరుపు. గుంటూరు జిల్లా కదా నాది!'' అన్నా.

''మరి గోంగూర పచ్చడేది?'' నిలదీసింది.

''అదే నేనూ అనబోతున్నా. ఫోన్‌చేసి చెప్తే మళ్ళీ కోపం. గుంటూర్లో పుట్టినవాళ్ళు గోంగూర పచ్చడిలేకుండా భోజనం పెడతారని కల్లోకూడా ఊహించలేదు'' శ్రీరమణగారు అందుకున్నారు.

రంగారావుగారికి కోపం వచ్చింది. ''వచ్చిన దగ్గర్నించీ చూస్తున్నా. ఏం పుట్టింది మీ ఇద్దరికీ! ఇలా కాల్చుకు తింటున్నారు? పాపం కష్టపడి అన్నిరకాలు చేస్తేనూ!'' అని ఖోపం తెచ్చుకుని గట్టిగానే కోప్పడ్డారు.

ఆయన చాదస్తంగానీ తాటాకు చప్పుళ్ళకు కుందేళ్ళు చెదురుతాయా. సుశీలగారున్నారంటే మహామహావాళ్ళకే భయపడరు. ఇక భర్తకి భయపడతారా!

శ్రీరమణగారి సంగతి చెప్పనే అఖ్ఖర్లేదు. పుట్టించిన దేవుడికి కూడా భయపడరు.

అందుకే ఆయనమీదికి దండెత్తారు. ''మీరూరికే ఆవిడని వెనకేసుకురాకండి. ఎన్నిరకాలు చేశారుట? నలుగురు పెద్దవాళ్ళని పిలుచుకున్నప్పుడు ఈమాత్రం చేసుకోరా ఏం? మీటింగు మధ్యలోంచీ పరిగెట్టుకొచ్చేస్తే ఆ హడావిడి చూసి ఇంకే చేశారో అనుకున్నాం'' అందావిడ.

''భేషుగ్గా చెప్పారు. కొబ్బరికాయ పెరుగుపచ్చడి చేసి గొప్పలు పోతే ఎందుకూరుకుంటాం? అదీ అడిగి చేయించుకున్నాం. బ్రాహ్మణ ఇళ్ళల్లో అదో పెద్ద వంటా?'' ఆవిడకి వత్తాసుపలికారు శ్రీరమణగారు.

ఏం చెయ్యాలో తోచక నిస్సహాయంగా నిట్టూర్చారు రంగారావుగారు. ''మరీ ఇలా గూండాల్లా మాట్లాడితే మనం ఏం చెయ్యగలం? వాళ్ళనొదిలెయ్యండి. వాళ్ళంతే. నే జెప్తున్నాగా. వంటలు బావున్నాయి'' అని ఓదార్చారు.

''నిజమేనండీ. మా ఆయన మొదటినించే అదోరకం. మిథునం రాశాక మరీ ఎక్కువైపోయింది గొడవ. మీరేం పట్టించుకోకండి'' అంది జానకి.

అలా వాళ్ళదారిన వాళ్ళను విడిచిపెట్టడంకూడా నచ్చలేదు వాళ్ళిద్దరికీ.

''ఏమాటకామాటే చెప్పుకోవాలి గారెలు మాత్రం బావున్నాయి'' అంది సుశీలగారు.

''నిజంగానే బావున్నాయి. సమంగా కుదిరాయి. అసలు ఏ వంటైనా సమంగా కుదిరితేనే కదా శ్రేష్ఠంగా వుండేది! గారెలు చెయ్యడంలో మీకు మీరే సాటి'' శ్రీరమణగారు మెచ్చుకున్నారు.

చావుతప్పి కన్నులొట్టపోయినట్లు అయింది నాకు. మరికాసేపు హడావిడి చేసి కాఫీ తాగి బాగుందని మెచ్చుకుని వెళ్ళిపోయారు.

అక్కడసీన్ కట్ చేస్తే మర్నాడు మధ్యాహ్నం బజారు పనిమీద కోఠీ వెళ్ళాను. పన్లన్నీ ముగించుకుని కారు ఎక్కాక సెల్ మోగుతోంది. తీస్తే శ్రీరమణ సెల్.

''ఏవిటి చెప్పండి!'' అని అడిగా!

''నిన్న మిమ్మల్ని గారెల విషయంలో పొగిడాంకదా! ఇవ్వాళ మాట్లాడుకుంటే తొందరపడ్డామేమో అనిపించింది. అనవసరంగా నోరుజారేశాం. గారెలొండడం కూడా గొప్పేనా! అవి ఎవరైనా బాగానే వుండుతారు. నేనూ సుశీలగారూ మా అభిప్రాయం మార్చుకుంటున్నాం'' అన్నారు.

''ఈ ముక్క సెల్‌కి ఫోన్‌చేసి మరీ చెప్పాలా?''

''ఏమో మీరనవసరంగా పొంగిపోతారేమో అని చెప్పేశా!''

''సర్లెండి అసలే విరోధినామసంవత్సరం! అందునా నాకు రాజపూజ్యం రెండూ, అవమానం పన్నెండూ అని రాసుంది. మహామహా వాళ్ళకి బిరుదులిచ్చి తర్వాత వెనక్కి తీసుకోవడం కూడా జరుగుతుంది కదా! దాంతో పోల్చుకుంటే ఇదో లెక్కా! కానివ్వండి!'' అన్నా.

ఇంటికొచ్చేసరికి మా ఆయన అటూ ఇటూ తిరిగేస్తున్నారు. ''సుశీలగారు నీకోసం మూడుసార్లు ఫోన్ చేశారు. అర్జెంటుగా ఏదో చెప్పాలిట'' అన్నారు ఇంకా లోపలికి వెళ్ళగానే.

ఆవిడ చెప్పాలనుకున్నది శ్రీరమణగారు చెప్పేశారు

అన్నా విన్లేదు. ఫోన్ చెయ్యి అని కంగారు పెట్టేశారు.

ఫోన్ చేస్తే ఆవిడా అదే చెప్పారు.

"ఇన్నేళ్ళుగా ఎంతోమందిని పిలిచి భోజనం పెట్టాను గానీ ఇంత క్షోభ ఎప్పుడూ అనుభవించలేదు. నా ఫ్రెండ్స్ నా వంటతిని శభాష్ అన్నారు. బెంగాలీవాళ్ళకి, పంజాబీ వాళ్ళకి, కన్నడిగులకి ఎంతోమందిని మెప్పించిన నా వంటకి వంకలుపెడుతున్నారంటే ఇదేదో కుట్ర" అనేశాను.

మర్నాడు తెల్లారుతూనే ఫోను సుశీల గారు.

నిన్న మేమిద్దరం మీరు చెప్పిన విషయంమీద సుదీర్ఘంగా మాట్లాడుకున్నాం. ఆవిడని అందరూ మెచ్చుకున్నారుట పాపం అని నేనంటే దానిదేముందండీ అసలే పెద్ద ఆఫీసరుగారి భార్య. ఆయన చూడబోతే సింహం లాంటి మనిషి.

ఆవిడ పిలిచి భోజనం పెడితే బాగాలేదనడానికి వాళ్ళకెన్ని గుండెలు? అందునా ఆవిడ ఫ్రెండ్సంటే ఎవరు? రైల్వేవాళ్ళు. రైలు వాళ్ళ భోజనాలతో పోల్చుకుంటే ఏదైనా బాగానే వుంటుంది మరి. ఇక పొగడకేం చేస్తారు? అదేం గొప్ప విషయం కాదు అన్నారు శ్రీరమణగారు" అందావిడ. అంతేకాదు "ఓ పని చెయ్యండి మీరు శ్రీరమణగారికి ఫోన్ చేస్తే ఆయనింకా విపులంగా చెప్తారు" అని సలహాకూడా ఇచ్చారు.

"ఏం అఖ్ఖర్లేదు. ఆయనే ఫోన్ చేస్తారు. మీకథ బావుందనో, మరో మంచి మాటో చెప్పాలంటే పోన్లెద్దూ ఇవ్వాళ కాకపోతే రేపు చెప్తా నిదానంగా అనుకుంటారు గానీ ఇటువంటి పిచ్చి కబుర్లన్నీ వెంటనే చెప్తారు" అన్నాను.

అని అరగంట కాలేదు. శ్రీరమణగారి ఫోన్. ఆఫీసునించి. "ఇప్పుడే ఆవిడ చెప్పారు. నేను విన్నాను" అన్నా విన్లేదు.

"ఆహా అలా ఎలా వీలవుతుంది?" అని మళ్ళీ వివరంగా చెప్పారు. అంతటితో ఆగినా ఫర్వాలేదు. "మళ్ళీ సాయంత్రం మాట్లాడుకుంటాం మేమిద్దరం! ఈ విషయంమీద!" అన్నారు.

ఏదైనా జరగరాని విషయం జరిగితే కమిటీని వేస్తారు! అలా సంప్రాప్తం అయ్యారు ఈ ద్విసభ్య కమిటీ నాకు.

మళ్ళీ ఏదో చర్చించుకున్నారుట. మళ్ళీ ఈవిడ ఫోను.

నా ఓర్పు చచ్చిపోయింది. "ఇక లాభంలేదు. మిమ్మల్నిలా వదిలేస్తే నా బుర్ర పూర్తిగా తినేస్తారు. వెంటనే పోలీసులకి ఫోన్ చేసి ఇద్దరు టెర్రరిస్ట్‌ల ఆచూకి తెలిసింది నాకు. ఒకరు న్యూబోయినపల్లిలోనూ, ఇంకొకరు ఓమ్ నగరు సాయిబాబా గుడిదగ్గరా వుంటారు అని చెప్తాను జాగర్త" అని బెదిరించాను.

బెదిరించానే గానీ బెదిరిపోయే ఘటాలుకావు. మళ్ళీ చర్చజరిపి ఓ టెర్రరిస్ట్ నల్లకుంట శంకర్‌మఠ్ ఎదురుగా లైన్లో వుంటుందని నా మీదికే పోలీసులను పంపినా పంపగలరు!

జానకికి ఫోన్ చేసి "చూశారా వీళ్ళిద్దరూ నామీద ఎలా దండయాత్ర సాగిస్తున్నారో!" అంటే పాపం జాలిగా నవ్వింది.

"అప్పుడే ఏమైంది? ఇంకా బోలెడు విషయాలు చర్చించి మీకు చెప్తారుట. గంటలతరబడీ చర్చించుకుంటున్నారు?" అంది.

"మరేం చెయ్యను?"

"మీరు ఏం చేస్తారు? ఇద్దరూ ఇద్దరే. బతిమాలితే వినరు. భయపెడితే లొంగరు. మీరే సర్దుకుపోండి. చూసీ చూడనట్లూ ఊరుకోండి. నాలుగురోజులు హడావిడి చేసి వాళ్ళే ఊరుకుంటారు!" సలహా చెప్పింది.

"సర్లేండి. అదే ఉత్తమం. కాస్త ఈసందడి తగ్గాక మళ్ళీ మిమ్మల్ని భోజనాలకి పిలవాలి" అని చెప్పి ఫోన్ పెట్టేశాను.

నిజమే! ఈ అదృష్టం అందరికీ దక్కుతుందా! పూర్వజన్మ సుకృతం వుండాలి ఇలాంటి స్నేహితులు దొరకాలంటే!

ఈమాత్రం సందడి లేకపోతే జీవితం నిస్తేజంగా మారిపోదూ మరి! ■

## హ్యూ'మని'జం

లేని బిడ్డను
తోలు ముసుగులో
చూసుకొని
పాలు ఇవ్వడం పశువునైజం
ఉన్న బిడ్డను
చిదిపేసి
తోలుతిత్తిని మిగుల్చుకోవడం
హ్యూ'మని'జం

నాగిశెట్టి